# వయసులో చిన్న..సేవలో మిన్న





**ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన..**

**ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ సంఘ సేవకుడు పుట్టి సందీప్**

**రామాయంపేట,నవంబర్18(సూర్యరేఖ)**ఃమెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో ఆరవ వార్డులో ప్రముఖ సంఘ సేవకుడు పుట్టి సందీప్ ముదిరాజ్ తల్లి పుట్టి బాలమణి జ్ఞాపకార్థం సీతయ్య గుడి ఆవరణలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి కంటి సంబంధిత బాధితులు భారీగా తరలివచ్చారు.కామారెడ్డి పట్టణానికి చెందిన వీటి ఠాకూర్ హాస్పటల్ డాక్టర్ లింబాద్రి,మాక్స్ కేర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో నిరుపేద మహిళా వృద్ధులు పట్టణ ప్రజలు 250 మంది వరకు రావడం జరిగిందన్నారు. ఉచితంగా 150 మందికి కంటి పరీక్షలు,60 మందికి ఆపరేషన్లు 90 ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తలనొప్పి మోకాళ్ళ నొప్పులకు విటమిన్ సి మాత్రలు,కంటికి సంబంధించిన మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పట్టణ మహిళా వృద్ధులు,పట్టణ ప్రజలు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మత్స్యశాఖ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి..





**మత్స్యకారుల జీవనోపాధికి భరోసానిస్తున్న కాంగ్రెస్..**


**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్**

**రాజేంద్రనగర్,నవంబర్18(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్య శాఖ అభివృద్ధితో పాటు మత్స్యకారుల అభ్యున్నతికి పాటుపడి ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. శంషాబాద్ మండల పరిధిలోని నర్కుడ గ్రామ సమీపంలోని చెరువులో ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ చేప పిల్లలను వదిలారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. చేప పిల్లల పెంపకం ద్వారా మత్స్యకారులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉందన్నారు. అందుకే ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తుందన్నారు.ఇందులో భాగంగా చేప పిల్లలను చెరువులో వదలడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మత్స్యకారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని వివరించారు.శంషాబాద్ మండలానికి 1 లక్ష 38 వేలు, గండిపేటలో 3 లక్షల 13 వేల చేప పిల్లలనూ చేరులలో వదలడం జరిగిందని వివరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి నీరటి తన్వి రాజు,మాజీ సర్పంచ్లు,మండల పార్టీ అధ్యక్షులు పార్టీ సీనియర్, నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తులు,అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వం

**రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయం**

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్**





**రాజేంద్రనగర్,నవంబర్18** కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాత ప్రభుత్వమని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి. ప్రకాష్‌గౌడ్ వ్యాఖ్యానించారు. గతంలో ఏ ప్రభుత్వాలు ఆలోచించని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించి వారి సంక్షేమానికి కృషి చేస్తుందని వివరించారు.శంషాబాద్ మండల పరిధిలోని మల్కారం గ్రామంలో ప్రాథమిక సహాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రైతులు చాలా కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ద్వారా గుర్తించబడి ఏర్పాటు చేయబడిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అమ్మాలని అన్నారు.వరి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా వరి ధాన్యం కొనుగోలు కేంద్రము నిర్వహించాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులను కోరారు.

# ఆరోగ్య కేంద్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలి..







**కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన**

**మెదక్ జిల్లా వైద్యధికారి శ్రీరామ్**

**కొల్చారం,నవంబర్18(సూర్యరేఖ)** ప్రజలకు ఏ రోగం వచ్చిన ఆదుకునే దేవుడ్లుగా.. ఉన్న డాక్టర్లపై..ఎంతో నమ్మకంతో ఆస్పత్రికి ప్రజలు వస్తారని.. డాక్టర్ చూస్తే రోగం బాగుపడుతుందని.. ఎంతో ఆశతో వస్తుంటారని,ం ోగుల పట్ల సద్భావనతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ సూచించారు. సోమవారం కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్,జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నవీన్ కుమార్ లు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆరోగ్య కేంద్రంలో ఉన్న గదులన్నింటినీ తనిఖీ చేశారు. అదేవిధంగా సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఇక్కడ రోగులకు ఇచ్చే సర్వీసు చాలా బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ విధంగానే రోజు మీ వీధిలో నిర్వహించుకోవాలని,మీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్,ఆయుష్ మెడికల్ ఆఫీసర్ శ్రీమతి హర్ష, మదన్మోహన్ ఎంపీహెచ్ ఈఓ, యేసుమని పిహెచ్ ఎన్.మార్తా సూపర్వైజర్, ఫార్మసిస్ట్ సరిత,ఆరోగ్య కేంద్ర సిబ్బంది,ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

## గుమ్మడి ప్రజాయుద్ధ నౌక గద్దర్ కూతురు వెన్నెలకి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసిన ప్రముఖ సంఘ సేవకులు,సేవా రత్న అవార్డు గ్రహీత, బీసీ నాయకులు బండారి గంగాధర్



**శివంపేట్,నవంబర్18(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథిగా చైర్ పర్సన్ గా నియమితురాలైన గుమ్మడి ప్రజాయుద్ధ నౌక గద్దర్ కూతురు వెన్నెలకి ప్రముఖ సంఘ సేవకులు బండారి గంగాధర్. శాలువాతో సన్మానం చేసి బొకేతో అభినందనలు,హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలల హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మల మైసయ్య,సూరారం స్వామి,గొల్లపల్లి పెద్ద నరసన్న,రాజ్ కుమార్,నరేష్ యాదవ్,వెంకటేష్, మోహన్,దీటికాడి మహేష్,బిజిఆర్ యువసేన అధ్యక్షులు కుమ్మరి నాగరాజు,బండారి సాయి కిరణ్,పెద్దపులి మహేష్, బండారి ఆంజనేయులు, గుర్రాల భూపాల్,తదితరులు పాల్గొన్నారు.

## బిలోలిలో ప్రచారంలో పాల్గొన్న. కైలాస్ శ్రీనివాసరావు



**కామారెడ్డి,నవంబర్18(సూర్యరేఖ)** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం చివరి రోజైన బిలోలి నియోజకవర్గంలో సోమవారం కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కైలా శ్రీనివాస రావు,ముక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని ఓటర్లను అభ్యసించారు.బిలోలి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నివృత్తి కంబ్లీకి మద్దతుగా ప్రచారం నిర్వహించారు.ఈ ప్రచార కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి,ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కైలా శ్రీనివాసరావు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవరాజు గౌడ్,రాజాగౌడ్, మిట్టు ఆనంద్,నంద రమేష్,తదితరులు పాల్గొన్నారు.

## కొండకల్ గ్రామంలో దేవాలయాల ముఖ్య కడపలు ప్రతిష్టాపన..



**శంకర్పల్లి,నవంబర్ 18(సూర్యరేఖ)**కొండకల్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లన్న, బీరప్ప,పోచమ్మ దేవాలయాల ముఖ్య కడపలు సోమవారం ప్రతిష్టాపనా చేశారు.ఈ కార్యక్రమం కురుమ సంఘ ఆధ్వర్యంలో శ్రీశైల వేద పండితులు గౌతమ్ చేతులమీదుగా ప్రత్యేక పూజలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయాల నిర్మాణం లో భాగంగా సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. తదుపరి భక్తులకు అన్నప్రసాదం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘ సభ్యులు,గ్రామ పెద్దలు,స్థానిక ప్రజలు భారీగా పాల్గొని ఈ పవిత్ర కార్యక్రమాన్ని పూర్తి శ్రద్ధతో ఆచరించారు.

## రూ.1.50 లక్షల విలువైన మత్తు పదార్థాలు కాల్చివేత..



**కామారెడ్డి,నవంబర్18(సూర్యరేఖ)** జాక్రంపల్లి మండలంలో మత్తు పదార్థాలు మాదక ద్రవ్యాలను సోమవారం ఎక్సైజ్ అధికారులు ధ్వంసం చేశారు.ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వి.సోమిరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా ప్రవేశం ఎక్సైజ్ అధికారి కే మల్లారెడ్డి పర్యవేక్షణలో సోమవారం ఎక్సైజ్ అధికారులు ఒక్క కోటి 50 లక్షల విలువైన ఎండు గంజాయి డైజోఫామ్ అల్ఫాజూలం వంటి మత్తు పదార్థాలు,మాదక ద్రవ్యాలను ధ్వంసం చేశారు.జాక్రాన్ పల్లి మండలం పడకల్ గ్రామంలో మెడికేర్ సర్వీస్ లో వివిధ ఎక్సైజ్ స్టేషన్లో ఆర్మూర్, భీంగల్,నిజామాబాద్,మోర్తాడు రూ కోటి 5 లక్షల విలువైన 3503 కిలోల రెండు గంజాయి,ఒక కిలో డజోఫామ్,రెండు కిలోల అల్ఫాజోలం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్ రావు తెలిపారు. భీంగల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన ఎనిమిది కేసులలో 102.5 కిలోల గంజాయి,ఒక కిలో డైజోఫామ్,500 గ్రాముల అల్ఫాదూలంను ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ డిపి ఈఓకే మల్లారెడ్డి,ఎస్ హెచ్ ఓ ఆర్మూర్,మోర్తాడు,నిజామాబాద్,భీమ్గల్ స్టేషన్ లా ఎస్హెచ్ఓలు గుండప్ప దిలీప్ పి.వేణు మాధవరావుతో పాటు సంబంధిత స్టేషన్లో సిబ్బంది పాల్గొన్నారు.

# బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ప్రజాదర్బార్








**బెల్లంపల్లి,నవంబర్18(సూర్యరేఖ)** బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో నిర్వహించిన ప్రజాదర్బాల్లో పట్టణంలోని పలు సమస్యలపై బెల్లంపల్లి నియోజకవర్గానికి భారత కమ్యూనిస్టు పార్టీ బెల్లంపల్లి పట్టణ సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ కు వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ...కోల్ బెల్టు ప్రాంతమైన బెల్లంపల్లి పట్నంలోని అన్ని పాత కంపెనీ క్వార్టర్స్ లలో కాలి స్థలాల్లో ఇల్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారికి గతంలో ఎన్నోసార్లు రెవెన్యూ డిపార్ట్మెంట్ సర్వే చేసి,గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కొంతమందికి జీవో నెంబర్ 76 ప్రకారం పట్టాలు ఇవ్వడం జరిగింది.కానీ ఇచ్చిన పట్టాల ద్వారా ఇంటి యజమానులకు ఎటువంటి హక్కులు లేవు.బెల్లంపల్లి పట్నంలోని అన్ని వార్డులలో సర్వే జరిపించి అర్హులైన అందరికీ జీవో నెంబర్ 58 ప్రకారంగా పూర్తిస్థాయి అధికారాలు ఇంటి యజమానులకు ఉండే విధంగా అన్ని వార్డుల్లో ఉన్న వారందరికీ పట్టాలు ఇవ్వాలని,గతంలో జీవో నెంబర్ 76 ప్రకారం ఇచ్చిన పట్టాలను జీవో నెంబర్ 58 ప్రకారంగా సవరణ చేసి పూర్తిస్థాయి అధికారాలు, నూతనంగా గృహాలు నిర్మించుకుంటానికి బ్యాంకు రుణాలు పొందే విధంగా ఇంటి యజమానులకు పట్టాలు ఇవ్వాలని కోరారు. మున్సిపాలిటీ కార్మికులకు బండ్ల కార్మికులకు 1996వ సంవత్సరంలో అప్పటి ఎమ్మెల్యే గుండ మల్లేష్, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ కృషి ఫలితంగా చిన్నబుధ శివారులో 170 సర్వే నెంబర్లు ఉన్నభూమిని 5 ఎకరాలపై కార్మికులకు ఒక,రెండు గుంటల చొప్పున ఇవ్వడం జరిగినది.అట్టి భూమిని నిజమైన లబ్ధిదారులకు చెందకుండా మున్సిపల్ లో పనిచేస్తున్న ఎనిమిది మంది మాత్రమే కబ్జా చేసి అక్రమదారులకు అమ్మడం జరిగింది.ఈ విషయంలో రెవెన్యూ అధికారులు ఎమ్మెల్యే స్పందించి అట్టి భూమిని మున్సిపల్ కార్మికులకు ఎడ్లబండ్ల కార్మికులకు ఒకరికి రెండు గుండ్ల చొప్పున ఇస్తూ ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని తెలిపారు. వ్యాపారాల నిలయమైన బెల్లంపల్లి బజార్ ఏరియాలో షాపింగ్ చేసేవారికి వాహనం నిలుపుటకు పార్కింగ్ స్థలం లేక రోడ్లపైనే వాహనములు నిలుపుతున్నారు. పోలీసులు అట్టి వాహనంలో ఫోటోలు తీసి చలాన్లు వేస్తున్నారు.దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ నష్టపోతున్నారు.రోడ్లను వెడల్పు చేసి వాహనములు నిలుపుకొనుటకు పార్కింగ్ చేసుకొనుటకు వీలు కల్పించగలరు.బజార్ ఏరియాలో మార్వాడీలు గల్లి సందులను ఆక్రమించుకొని మెట్లు రోడ్డుపైకి నిర్మించుకున్నారు, వాస్ ఏరియాస్ కూడా నిర్మించారు.దీనివల్ల గల్లీలో రాక పోకలు సాగించే వారికి చాలా ఇబ్బంది పడుతున్నారు.మున్సిపల్ సిబ్బంది వెంటనే పర్యటించి వాటిని తొలగించగలరు. బెల్లంపల్లి పట్నంలో మంచినీరు సరఫరా సక్రమంగా లేక ప్రజలు నీటికి చాలా ఇబ్బంది పడుతున్నారు.తక్షణమే మంచినీరు క్రమంగా రోజుకు ఒకసారి ఇచ్చేటట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు.సమస్యలను పరిష్కరించడానికి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించగలనని సానుకూలత వ్యక్తం పరిచారు.ఈ కార్యక్రమంలో ఆడెపు రాజమౌళి, కార్యదర్శి సిపిఐ బెల్లంపల్లి పట్టణ సమితి,రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి,బొల్లం పూర్ణిమ,జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, దాగం మల్లేష్,జిల్లా సమితి సభ్యులు అక్క పెల్లి బాబు,గుండా చంద్రమాణిక్యం, బొంతల లక్ష్మీనారాయణ, రత్నం రాజం,జిల్లా మహిళా సమాఖ్య సహాయ కార్యదర్శి పద్మ,తదితరులు, పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్లతో..జరభద్రం!

**బ్యాంకు ఖాతాలకు సంబంధించిన సమాచారం ఫోన్ లో పంచుకోవద్దు..**

**ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి..**

**అప్రమత్తతే శ్రేయస్కరమంటున్న సర్కిల్ ఇన్స్పెక్టర్**

**రామాయంపేట,నవంబర్16(సూర్యరేఖ)** ప్రస్తుతం మనమెంత జాగ్రత్తగా ఉన్నామని భావించిన ఒక్కోసారి సైబర్ నేరగాళ్ల వలలో పడుతుంటాం.. అంతలా మాయజేసి మన వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా ! సమాచారం సంగ్రహించి దర్జాగా మోసం చేస్తున్నారు.ఇందుకోసం సరికొత్త సాఫ్టువేర్లను సైతం ప్రవేశపెట్టి మరీ దోపిడికి ఎగబడుతున్నారు.స్మార్టుఫోన్,ఇంటర్నెట్ వినియోగం ఇలా ఏదైనా ఆన్ లైన్ మోసం చేయడం సులభమైపోయింది. ప్రస్తుతం ఇంటర్నెట్ సేవలు కోట్లాది మంది వినియోగిస్తున్నారు.సేవల్లో భాగంగా రోజుకో కొత్త యాప్ పుట్టుకువస్తుంది..లక్షలాది యాప్ లు ఉన్నప్పటికి అందులో కొన్ని మాత్రమే సురక్షితం. సైబర్ నేరగాళ్లు మొబైల్ వినియోగదారులను బుట్టలో వేసుకునేందుకు ఎప్పటికప్పుడు కొత్తదారులను వెతుకుతునే ఉన్నారు.వారి వలలో చిక్కిన వారు వారి బ్యాంకు ఖాతా నుంచి డబ్బులను పోగొట్టుకుంటున్నారు.మీ ఫోన్ నెంబరుకు బహుమతి వచ్చిందని,ఎటిఎం కార్డు బ్లాక్ అయిందని కార్డు నెంబరు, పిన్ నెంబరు చెప్పాలంటూ మొబైల్ సంబంధిత వినియోగదారులకు ఫోన్లు చేస్తూ అమాయకుల నుంచి వారికి కావలసిన సమాచారం సేకరిస్తూ వారి ఖాతాల్లో నుంచి తమ డబ్బులను కాజేస్తున్నారు.గతంలో ముంబాయి, ఢిల్లీ,చెన్నై, బెంగళూరు,హైదరాబాద్ లాంటి మహానగరాలకు మాత్రమే పరిమితమైన సైబర్ నేరాలు ఇప్పుడు మారుమూల గ్రామాలకు కూడా విస్తరించాయి.మీరు విలువైన వినియోగదారుడని,మీకు కొన్ని అదనపు సదుపాయాలు అందిస్తున్నామని,దీనికోసం కొంత మొత్తం నెలనెలా చెల్లించాలని మొబైల్ కు సందేశం వస్తుంది.సర్వీసులు కావాలంటే ఎస్ అని, వద్దనుకుంటే నో అని ప్రెస్ చేయమని అందులో ఉంటుంది.ఏది నొక్కినా సైబర్ నేరగాళ్లు పంపే వైరస్ ని మీ మొబైల్లో వచ్చి చేరుతుంది.అప్పటి నుంచి మొబైల్ ద్వారా నిర్వహించే బ్యాంకింగ్,క్రెడిట్ కార్డు లావాదేవిలన్ని వారికి చేరుతాయి.

**జాగ్రత్తలు తప్పనిసరి..!**

**రామయంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటరాజాగౌడ్**




ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు చాలా విపరీతంగా పెరిగిపోయాయని,ప్రజల్లో ఎంత అవగాహన తీసుకువచ్చినప్పటికీ కూడా చదువు లేని వారితో పాటు చదువుకున్న వారు చాలా మంది సైబర్ నేరాల బారిన పడుతున్నారన్నారు. ఈమధ్య ఏందంటే పార్ట్ టైం జాబ్ అని చెప్పి యువతకు ఇరవేస్తున్నారని, పార్ట్ టైం జాబ్ ఇంట్లో ఉండి చాలా ఎక్కువ సంపాదించాలని వచ్చిన పేగు ఆన్ లైన్ లింకులపై క్లిక్ చేయమని వారితో చాట్ చేస్తుంటే ముందు డబ్బులు వేయమని చెబుతారు వీళ్లు డబ్బులు ఎక్కువ వస్తున్నవి అని డబ్బులు వేస్తూ ఉంటారు.ఆ డబ్బులు తిరిగి రావన్నమాట దాన్ని తెలుసుకోలేక పోతారు. పార్ట్ టైం జాబులు ఇచ్చేవారు డబ్బులు వేస్తారే తప్ప డబ్బులు వేయమని అడగరు.ముందు అది గుర్తుపెట్టుకోవాలి కాబట్టి ఫేక్ ఆన్లైన్ లింకులు క్లిక్ చేసి ఎవ్వరు డబ్బులు వేయవద్దన్నారు.ఇది సింపుల్గా కామన్ సెన్స్ తో ఆలోచించాలి అర్థమవుతుంది. ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు డబ్బులు వేయకూడదని చాలామంది పిల్లల పేరెంట్స్ కి పోలీసులమని చెప్పి డబ్బులు వేయమని నీ కొడుకు మా వద్ద కస్టడీలో ఉన్నాడని, డ్రగ్స్ తో దొరికినా చాలా ఏడుస్తున్నారని పేరెంట్స్ కి కాల్ చేస్తారు.కానీ పోలీసులు ఎవ్వరు కూడా డబ్బులు అడగరని కంగారుతో చాలామంది పిల్లల పేరెంట్స్ వేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు.వాటిని ఎవరు నమ్మవద్దని అటువంటి కాలు ఏవైనా వస్తే లోకల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, 1930కి సమాచారం ఇస్తే సైబర్ కేసు కింద నమోదు చేసుకుంటామన్నారు సైబర్ నేరగాళ్ల నుండి వీడియో కాల్స్ వస్తుంటాయి.ఆ వీడియో కాల్స్ ని లిఫ్ట్ చేయవద్దు వీడియో కాల్స్ లో నగ్నంగా ఉండేటట్లు చేసి ఆ మ్యూట్ వీడియోని తీసుకొని బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు అడుగుతున్నా సందర్భాలు ఎన్నో ఉన్నాయి.చాలా ఇటువంటి కాంప్లైన్స్ కూడా రిక్రూట్ అయినవి కాబట్టి అనోన్ పర్సన్ ఎవరు కూడా వీడియో కాల్స్ చేసినా లిఫ్ట్ చేయవద్దు.సైబర్ నేరాల బారిన పడాల్సి వస్తుంది అని ఎవరన్నా ఓటిపి అడిగినా ఎవరు చెప్పవద్దన్నారు.ఇప్పుడు కులగనన సర్వే జరుగుతుంది కాబట్టి మీ బ్యాంకు డీటెయిల్స్ ఎవ్వరూ అడగరు.ఒకవేళ అడిగిన ఇవ్వకూడదని వారి గురించి పూర్తిగా తెలుసుకోవాలి తెలిపారు. సైబర్ నేరాలపై ప్రతి గ్రామంలో ప్రతి వారం ప్రజలకు అవగాహన చేస్తున్నాం ఇంత చేసిన ప్రజలకు తెలియకపోతే నష్టపోయేది ప్రజలు మాత్రమే సైబర్ నేరాలపై కంప్లైంట్ పోర్టల్ ఉంటుందన్నారు డబ్బులు పోయిన వెంటనే సార్ టైంలో రిపోర్ట్ చేస్తే కేసు రిజిస్టర్ అవుతుంది.రికవరీ చేసే అవకాశం ఉంది.దాని ద్వారా ఏ అకౌంట్లో డబ్బులు పడ్డాయో అది తెలిసిపోతుందని వాటిని రికవర్ చేస్తారు.ఈ విషయంలో ప్రజలు యువత మోసపోవద్దని సూచించారు. క్రెడిట్ కార్డు,డెబిట్ కార్డులను తీసుకున్న వెనుక భాగంలో విధిగా సంతకం చేయాలి. దుకాణ యజమానులు కూడా ఎవరైన కార్డుల ద్వారా లావాదేవిలు జరిపినప్పుడు వారి సంతకాన్ని కార్డుపై ఉన్న సంతకంతో సరిచూడాలి.దీన్ని వల్ల ఇతరుల కార్డు వినియోగించడానికి అవకాశం ఉండదు.ప్రతి కారుకు వెనుకభాగంలో సివివి నెంబరు ఉంటుంది.దీన్ని మనం గుర్తుంచుకుని కార్డుపై ఉన్న సివివి. చేర్చివేయాలి. ఎక్కడైన స్వీప్ చేసినప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలి. చాలాకాలం కార్డులు వాడకుంటే వెంటనే బ్యాంకులకు సమాచారం ఇచ్చి కార్డులను బ్లాక్ చేయించుకోవాలి.ఎటిఎం కార్డుల ద్వారా లావాదేవీలు జరిగినప్పుడు మొబైల్ ఎస్ఎంఎస్ సందేశం వచ్చేలాగా చూసుకోవాలి.ఈ నేపథ్యంలో అప్రమత్తతే మనకు రక్ష నెట్ వినియోగంలో జాగ్రత్తతో వ్యవహరించకపోతే తీవ్రంగా నష్టపోవలసి వస్తుంది.

## విట్టల్ రెడ్డి తల్లి దశదినకర్మకు..నివాళులర్పించిన నాయకులు



**కొల్చారం,నవంబర్18 (సూర్యరేఖ)** మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామం లో మాజీ ఉప సర్పంచ్ జీడిపల్లి విట్టల్ రెడ్డి తల్లి దశదినకర్మకు పాల్గొని నివాళు లర్పించారు.చేగుంట తాజా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రజనకు ప్రవీణ్ కుమార్, చందాయిపేట తాజా మాజీ సర్పంచ్ బుడ్డ భాగ్యరాజ్,కమ్మరి రాజు,రజనకు రాము, ఎండి నదీమ్ తదితరులు పాల్గొన్నారు

## నేడు ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు..

**కామారెడ్డి, నవంబర్ 18( సూర్యరేఖ)** కళాభారతి ఆడిటోరియంలో సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుపరుస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు.ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈనెల 19 తేదీ మంగళవారం స్థానిక కళాభారతి ఎడిటోరియంలో మధ్యాహ్నం మూడు గంటల నుండి హైదరాబాద్ నుండి వస్తున్న అంతడు పూల నాగరాజు బృందంచే సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## బెల్లంపల్లిలో ప్రజాదర్బార్ కు విశేష స్పందన

**ప్రజా సమస్యలను పరిష్కరించాలని,దగ్గరుండి, అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే**



**బెల్లంపల్లి,నవంబర్18(సూర్యరేఖ)**బెల్లంపల్లి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో ప్రభుత్వ శాఖల అధికారులు ప్రజాద ర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి వివిధ సమస్యలపై వచ్చిన ప్రజల నుండి అధికారులు వినతి పత్రాలు స్వీకరించారు.త్వరలోనే సమస్యలపై సమీక్ష నిర్వహించి దశలవారీగా పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వినోద్ ప్రజల సమస్యలు నేరుగా పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత శాఖల అధికారులు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దీపక్ కుమార్,ఆర్డిఓ హరికృష్ణ,ఏసీపి రవికుమార్ కుమార్, వన్ టౌన్ సీఐ దేవయ్య,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్భాటంగా ముగిసిన దంగల్..

**టైటిల్ విజేతగా సుస్మిత్ పైల్వాన్**



**రాజేంద్రనగర్,నవంబర్18** సర్దార్ వల్లబ్ బాయ్ పటేల్ కేసరి కుస్తీ పోటీలు అత్తాపూర్ డివిజన్ రాంబాగ్ మైదానం కేంద్రంగా ఆదివారం రాత్రి అట్టహాసంగా ముగిశాయి.ఈ ఆరవ కుస్తీ పోటీలలో టైటిల్ బహుమతిని సుస్మిత్ పహిల్వాన్ దక్కించుకున్నారు.రెండవ విజేతగా సాకేత్ పహిల్వాన్, మూడవ బహుమతి మహేందర్ లు గెలుపొంది విజేతలుగా నిలిచారు.బాలకేసరి విజేతగా సాయిదర్శన్ యాదవ్,మూడవ బహుమతి గౌరవ్ లు గెలుపొందారు.కార్తీక ఉమెన్ కేసరి విజేతగా నిలిచారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్,కుస్తీ పోటీల కమిటీ చైర్మన్,బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జ్ నారగూడం మల్లారెడ్డి,ప్రధాన కార్యదర్శి గౌరిగే రాజు పైల్వాన్,యాదయ్య ముదిరాజ్, సంతోష్ పైల్వాన్,బోట్రాజ్ పైల్వాన్,అభిమన్యు పైల్వాన్,సీనియర్ జర్నలిస్ట్ మేడం మధుసూదన్,ఆ పార్టీ సీనియర్ నాయకులు మల్లేష్ యాదవ్,నల్లింగ్ రమేష్, ఎస్.జయా నంద్ రెడ్డి,భాస్కర్ గౌడ్,కొలన్ జైపాల్ రెడ్డి,సత్యం,అత్తాపూర్ సీఐ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కల్వకుర్తి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన బిఎన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ శేఖర్ రెడ్డి



**ఇబ్రహీంపట్నం,నవంబర్18(సూర్యరేఖ)**కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ని బియన్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి,తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు లిమిటెడ్ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్యతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటేశ్వర గౌడ్ పాల్గొన్నారు.

# దివంగత పెండ్యాల శ్రీనివాస్ జయంతిని పురస్కరించుకొని నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ












**సేవలు చేస్తూ.. ప్రేమను పంచుతూ..**

**పరోపకారమే లక్ష్యంగా శ్రీనివాస సేవా సమితి ప్రయాణం..**

**స్ఫూర్తిగా నిలుస్తున్న శ్రీనివాస సేవా సమితి సేవలు..**

**దుప్పట్ల పంపిణీలో పాల్గొన్న శ్రీనివాస సేవా సమితి చైర్మెన్ పెండ్యాల సాయి మాలిక్**

**రాజేంద్రనగర్,నవంబర్18** వేసవి కాలంలో రోడ్లపై నిర్భాగ్యులు చలితో ఇబ్బందులు పడటం చూసి చలించి రాజేంద్రనగర్ బుద్వేల్ లోని శ్రీనివాస సేవా సమితి తరపున సామాజిక కార్యకర్త పెండ్యాల శ్రీనివాస్ జయంతిని పురస్కరించుకొని తమ వంతుగా దుప్పట్లు పంపిణీ చేశామని సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్ అన్నారు.శ్రీనివాస సేవా సమితి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకునేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని వివరించారు.అందులో భాగంగా ఆదివారం రాత్రి నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ పంపిణీ చేసి దాతృత్వాన్ని చాటుకున్నారు.ఖాళీ కడుపులతో అలమటిస్తున్న అనాధలకు భోజనం అందించారు. శివరాంపల్లి,అరాంఘర్,శంషాబాద్ రోడ్,అత్తాపూర్,హైదర్ గూడ,మెహదీపట్నం సరోజిని దేవి కంటి ఆసుపత్రి,మాసబ్ ట్యాంక్ తదితర ప్రాంతాలలో రోడ్డు కిరువైపులా చలితో బాధ పడుతూ నిద్రిస్తున్న వారికి దుప్పట్లను అందజేశారు.ఈ సందర్భంగా పెండ్యాల సాయి మలిక్ మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం పెండ్యాల శ్రీనివాస్ జయంతి,వర్ధంతి రోజున నిరుపేదల కోసం ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజ సేవలో సేవా సమితి నిరంతరం పాలు పంచుకుంటుందని వివరించారు.చలికాలం కావడంతో యాచకులు,పేదలు గన్నీ బ్యాగులు,ప్లాస్టిక్ కవర్లు కప్పుకొని చలికి వణకడం చూసి చలించిపోయామని తెలిపారు.నా అన్నవాళ్లు లేక అలాంటి వాళ్లు పడే బాధలు వర్ణనాతీతం అన్నారు.అందుకే తమ సంస్థ తరఫున దుప్పట్లు, శాలువాలు అందజేశామని పేర్కొన్నారు.వారందరికీ తమకు చేతనైన సాయం చేయడం సంతృప్తినిచ్చిందని అన్నారు.భవిష్యత్తులో శ్రీనివాస సేవా సమితి తరపున మరిన్ని సేవాల కార్యక్రమాలు చేపడుతామని స్పష్ట చేశారు.

# ఆలయ ప్రాంగణంలో చెత్త తొలగిస్తుండగా పేలుడు





**పూజారికి తీవ్ర గాయాలు..**

**పేలుడుకు గల కారణాలు వెతుకుతున్న పోలీసులు..**

**లక్ష్మీగూడలో ఘటన..**

**రాజేంద్రనగర్,నవంబర్ 18** మైలార్ దేవ్ పల్లిలోని పోలీస్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీగూడలో పేలుడు కలకలం రేపింది. స్థానికంగా ఉన్న లక్ష్మీగూడలోని ప్రజాపతి శ్రీశ్రీయాదేమాత ఆలయం సమీపంలో చెత్తను తొలగిస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది.ఈ ఘటనలో పూజారి సుగుణారామ్ నకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన అతడిని ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఏవిధంగా జరిగింది అనే దానిపై ఆరా తీశారు. ఏసీపి శ్రీనివాస్,సీఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. రామాంతపూర్ ప్రాంతానికి చెందిన సుగుణరామ్ (55) గత పది సంవత్సరాలుగా లక్ష్మీగూడ(మార్వాడి సమాజ్ )రాజస్థాన్ ప్రజాప్రతి శ్రీ శ్రీ యాదేమాత మందిరంలో పూజారిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. సోమవారం ఉదయం పూజ కార్యక్రమాల అనంతరం కాళిగా ఉన్న సమయంలో దేవాలయం ప్రధాన రహదారి ఫుత్ పాత్ పై పిచ్చి మొక్కలు,గడ్డి ఎపుగా పెరగడంతో వాటి తొలగించడానికి పారతో చదును చేసే క్రమంలో ఒక్కసారిగా అక్కడ ఉన్న పేలుడు పదార్థం భారీ శబ్దంతో పేలింది.ఈ క్రమంలో ఆ పూజారికి కళ్ళకు,తలకు తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు శబ్దానికి చుట్టుప్రక్కల వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. గాయాలతో రోడ్డుపై పడిఉన్న పూజారిని స్థానికులు లేపి కూర్చోబెట్టారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలనికి చేరుకున్న రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్,సీఐ నరేందర్ గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం శంషాబాద్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.క్లూస్ టీమ్ ను రంగంలోకి దింపి పేలుడుకు గల కారణాలు తెలుసుకునే పనిలో పడ్డారు.ఈ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# సమగ్ర సర్వే ప్రక్రియపై సమీక్ష..

**సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా చేపట్టాలి..**

**సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలి..**

**రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్**

**రాజేంద్రనగర్,నవంబర్ 18** సామాజిక,ఆర్థిక,విద్య,ఉపాధి,రాజకీయ,కులగణనపై నిర్వహించే ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్ అన్నారు.సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సర్వేపై ఎన్యుమరేటర్లకు,సూపర్వైజర్లకు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం డీసీ పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ. సర్వే చేసి రిపోర్టును ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు.ఈ డేటా ఎంట్రీ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు.ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు.ప్రజలు ఎలాంటి అపోహలు పడకుండా ఎన్యుమరేటర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యుమరేటర్లు భాద్యతగా వ్యవహరించాలని సూచించారు. సర్వే కొరకు జారీ చేసిన బుక్ లెట్ లో మొత్తం 56 అంశాలున్నాయని ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావు లేకుండా ప్రజల నుండి ఖచ్చితమైన సమాచారం సేకరణతో నమోదులు చేయాలని తెలిపారు.




## రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఇంట్లో కులగణన సర్వే..



**రాజేంద్రనగర్,నవంబర్ 18** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే(కులగణన) ప్రక్రియ విజయవంతంగా సాగుతోంది.నేతలు తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకుంటున్నారు.ఈనెల 30తో ఈ కులగణన సర్వే పూర్తికానుంది.ఈ క్రమంలోనే రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఇంటికి రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్ కులగణన ఎన్యూమరేటర్లు వెళ్లి వివరాలు స్వీకరించారు.సోమవారం ఉదయం మైలార్ దేవులపల్లిలోని ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ఇంటికి కులగణన అధికారులు వెళ్లగా..కులగణనలో తమ కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయించారు.

## 11 కోట్ల సభ్యత్వాలు దాటిన బీజేపీ

**కార్యకర్తలందరికీ శుభాకాంక్షలు తెలిపి బొక్క బాల్ రెడ్డి**




**రాజేంద్రనగర్,నవంబర్18** ప్రపంచంలో భారతీయ జనతా పార్టీ శక్తివంతమైన పార్టీగా అవతరించిందని,ఏకంగా 11 కోట్ల సభ్యత్వాలు దాటాయని బీజేపీ నాయకుడు బొక్కా బాల్ రెడ్డి అన్నారు.ఆదివారం నాటికి భారతీయ జనతా పార్టీ సభ్యత్వాలు 11 కోట్లకు దాటడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.పశ్చిమ బెంగాల్ లో బీజేపీ సభ్యత్వాలు మొట్టమొదటిసారిగా లక్షకుపైగా నమోదై రికార్డు సృష్టించడం చాలా సంతోషమని అన్నారు.ఇప్పుడు తాను చెప్తున్న లెక్కలు కేవలం కొత్త సభ్యత్వాలని, సభ్యత్వ నమోదు చివరి నాటికి ఇవి ఇంకా పెరుగుతాయని అన్నారు.తెలంగాణలో బీజేపీ నాయకుల, కార్యకర్తల కృషి ఫలితంగా రికార్డు స్థాయి సభ్యత్వాల దిశగా దూసుకువెళ్తోందని, కార్యకర్తలు మరింతగా కృషి చేసి ప్రధానమంత్రి మోదీకి తెలంగాణ నుంచి క్రియాశీల కార్యకర్తలను బహుమానంగా ఇవ్వాలని అన్నారు.క్రియాశీల సభ్యత్వ నమోదు వల్ల మండల, జిల్లా,రాష్ట్ర స్థాయిలో పదవులు పొందే అవకాశం ఇస్తున్న ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ అని గుర్తుంచుకోవాలని చెప్పారు. పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులకు సరళ పద్ధతిలో బోధించాలి

**ఎంఈఓ బి.సత్తయ్య**



**సిద్దిపేట,నవంబర్18(సూర్య రేఖ)** విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ కూడా అలవర్చుకునేలా చేయాలని కుకునూర్ పల్లి ఎంఈఓ బచ్చల సత్తయ్య అన్నారు. కుకునూర్ పల్లి మండల పరిధిలోని సోమవారం రోజున ముద్దాపూర్ రామచంద్రపూర్ పాఠశాలలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించి ఆంగ్ల భాష పై పట్టు సాధించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని,అన్ని అంశాలు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## ప్రజా వాణి ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపాలి

**జిల్లా కలెక్టర్ ఎం.మనూచౌదరీ**



**సిద్దిపేట,నవంబర్18(సూర్యరేఖ)** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ,వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు,వినతులను జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి వస్తారని,అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 48 ఫిర్యాదులు అందాయని,వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే జిల్లా అధికారులు ప్రజావాణికి విధిగా హాజరుకావాలని అనుమతి లేనిదే గైర్హాజరు అయితే కఠిన చర్యలు తీసుకుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగ రాజమ్మ,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

